# వెలివేయవద్దు

(లాయర్ 1999)

రాకూడని జబ్బులు రావడం వాళ్ల దురదృష్టం.
ఆ దురదృష్టవంతుల్ని వెలివేయడం,
మన మనసులకు అంటిన అంటురోగం.
అనుకున్నంత అంటువ్యాధి కాదు ఎయిడ్స్ రోగం.

ఇరవై రోజులుగా నాలో చిక్కటి చీకటి, నా బాల్యం మాటిమాటికి నాకు గుర్తొస్తోంది. మధ్యమధ్యలో వర్తమానం గర్తుకొచ్చి ఆ తీయదనాన్ని కబళించేస్తోంది. అన్న మొట్టికాయల్లో మమకారం, అక్క లాలింపులో ఆదరణ కొండంత నాన్న నీడన ఓ ధైర్యం.... ఆ రోజులు ఇప్పుడు మరలా కావాలనిపిస్తున్నాయి. కనకనా? గానీ తనానాడు వాళ్లనర్థం చేసుకుంది ఆ రోజుల్లో నాన్నకు తన మీద ఎంత నమ్మకం! తనని కో-ఎడ్యుకేషన్ కాలేజీలో చేర్చేప్పుడు మా మామయ్య 'వద్దు, బావా! కీర్తనను లేడీస్ కాలెజీలో చేర్పించు రోజులసలే బాగలేవు' అని అన్నపుడు 'మా అమ్మాయి అలాటిదికాదు!' అని నాన్న తన బావమరిది మాటలు కొట్టేసారు. మరి తనేం చేసింది? వాళ్ల నమ్మకాన్ని వమ్ము చేసి ప్రేమించిన పిల్లాడితో పారిపోయి పెళ్లిచేసుకుంది.

ఆరోజు పూలమాలలతో జంటగా పుట్టింట్లోకి కాలు పెట్టినపుడు నాన్న కోపంలో కదలాడిన దెబ్బతిన్న భావాన్ని తలచుకున్నప్పుడల్లా ఈ ఇరవై రోజులుగా నా కళ్లు చెమరుస్తూనే ఉన్నాయి.

'ఆనాడు తన భర్తను తూలనాడారని ఆయనను కాదన్న' మీ గడప ఇంక తొక్కనని' శపథం చేసి వచ్చేసింది. మెట్టినిల్లే శాశ్వతమనే శతాబ్దాల సత్యాన్ని జీర్ణించుకున్న తను.

అలా పారిపోయిన రోజున అమ్మ చెప్పిన నీతి బోధలు ఇప్పుడు నిజమనిపిస్తున్నాయి కానీ ఆరోజు తనకు తలకెక్కాయా?'

సింహద్వారం దగ్గర అయిన చప్పుడుకి నాగతం చెల్లాచదరయింది. మా ఆయన తన స్వంత తాళంతో ముఖద్వారం తీసుకుని లోపలికి అడుగుపెట్టున్నాడు. నేను తాకిన తాళాన్ని తాకడం ఆయనకిష్టంలేదు. అప్యాయతతో కాకపోయినా జాలితో అయినా నా వైపు చూడకుండా మెట్లెక్కి ఒకనాటి మా పడకగది బాత్‌రూమ్‌లో స్నానం చేసి మరలా బయటికెళ్లిపోయాడు. 'నిన్ను చూడందే క్షణమైనా వుండలేనన్న ఈనాటి భర్త అయిన, ఆనాటి ప్రియుడు.

నిజం ఒప్పుకోవాలి అతను ఆ రోజుల్లో నిజంగానే నన్ను వదలి ఉండలేక పోయేవాడు. దానివల్ల హాస్టల్లో తను చాలా అపహాస్యాలకు లోనైంది. చదువు చెట్టెక్కింది కూడాను. బి.ఎ.పాస్ అయ్యుంటే ఈ రోజు జీవనభృతికి నలుగురు పిల్లలకు పాఠాలు చెప్పుకోగలగుండెది. తన నాన్న చదివించిన దానికి ఫలితం ఉండేది. నీరసంగా లేచి నాకివ్వబడిన డూప్లికేట్ తాళంతో తలుపు లాక్ చేసి వచ్చి కూర్చున్నాను. ఈ నాల్గుగడుగులకే నాకాళ్లల్లో ఎంత నిస్సత్తువో!

ఇంత నీరసంలో ఇంత నిరాదరణలో; ఇంత కరుణలేని నిరాకరణలో సైతం ఈ ఇంటిని రక్షించాలనే ఈ బలహీనపు భావమేమిటో! ఈ నిస్సత్తువ పదపాళ్లు నాకు సంక్రమించిన ఎయిడ్స్ రోగం వల్ల నా శరీరానిదయితే 90 పాళ్లు ఎలా బ్రతకాలి? ఎలా చావాలి? అనే ద్వంద్వ భావాల మధ్య నలిగిపోతున్న ఈ మనస్సుది,

'అయినా ఇక్కడ కూర్చుని ఎవరికోసం ఎదురు చూడాలి కనుక!'

లేచి ఆలోచిస్తూ నడుస్తున్న నేను స్పృహ వచ్చినట్లు మెట్లమీద ఆగిపోయాను. నా కాళ్లకు ఆశ నిన్నమొన్నటిదాకా తన జీవితాంతపు తోడనుకున్న మా శ్రీవారి కాళ్లమీద కాళ్లువేసి నాకు సుఖనిద్రని ప్రసాదించిన వాటి ఆశ.... హు ఎప్పటికైనా నాది అనుకునేది. మన శరీరమేనా? ఈ చేదు భావాన్ని సమర్థించడానికి నా మనస్సు అంగీకరించలేదు. మా పడక గది నిరాకరించిన వైనం గ్రహించి నాకాళ్లు నాకోసం నిర్దేశించబడిన గెస్ట్ బెడ్‌రూమ్‌లోకి దారితీశాయి. కానీ నాకాళ్లకు కూడా అదే ఆశలాగుంది. కంటి కొనల నుండి ఆ మెట్లవైపు చూశాయవి.

సరిగ్గా ఇరవై రోజుల క్రితం తమ వెడ్డింగ్‌డే రోజున ఎంత అందంగా అలంకరించుకున్నాయో ఆమెట్లు! మెట్లేవిటీ? ఆ చిన్న ఇల్లంతా ఎలక్ట్రిక్ బల్బులతో జిగినీ రెపరెపలతో, పూల తోరణాలతో బంధువులతో, ఆప్తులతో ఎంతలా సింగారించుకుందనీ! తనెంత మురిసిపోయిందనీ! కానీ ఇది నిజం తను మురిసిపోయింది తన భర్త పెట్టిన ఖర్చుల ఆడంబరాల్ని చూసికాదు! మమ్మల్ని దీవించడానికి వచ్చిన బంధువులను చూసి కాదు... ఆయనకు మా దాంపత్యం పట్లవున్న ఇష్టానికి, గౌరవానికి పరవశించింది తను. కానీ ఇది సంభవమా? అంతలావు ప్రేమా. ఒక్క 20 రోజుల అల్పకాలంలో ఇంతలా హరించుకుపోగలదా? తను మనసును తూట్లు పొడిచేంతగా దిగజారిపోగలదా?

ఆలోచిస్తూ నా పడక మీద కూర్చున్నాను. మనస్సు భారమైంది. తల విదిలించాను... అయినా ఆలోచనలు తప్పడంలేదు. అప్పుడే సంవత్సరం రోజులు గడిచి పోయాయా? అని ఆశ్చర్యపోయింది. వెడ్డింగ్‌డేన కొన్ని క్షణాలు యుగాలుగా, కొన్ని

రోజులు క్షణాలుగా గడుస్తాయనే వాస్తవాన్ని తెలుసుకున్న ఈ రోజు మా అమ్మ నాకు సంపూర్ణంగా అర్థమయింది. భర్తను కాదని బిడ్డల్ని వ్యతిరేకించి తన అవమాన భారాన్ని ప్రక్కనపెట్టి ఒక రోజు అమ్మ నా ఇంటికొచ్చింది.

'ఈ నెలరోజులు నాకు నాలుగు యుగాలుగా గడిచాయని' చెప్పి 'అల్లుడి కాళ్లు పట్టుకుని అడుగుతాను ఇద్దరూ వస్తూ పోతూ ఉండండి' అని ప్రాధేయపడ్తే..... అదాయన ఇష్టమని తను తప్పుకుని అమ్మకు యుగాల్ని కానుకగా ఇచ్చింది.

'ఆ శాపమే ఇది! నా గొంతులో గరగరలాడిన కన్నీళ్లను మ్రింగేసాడు. ఇంకెవరో నా కన్నీటిని తుడవరన్న నిజాన్ని తెల్సుకున్న నా చేతులే నా కన్నీళ్లను తుడిచాయి. మరలా తలుపు చప్పుడైన శబ్ధం. నేను మంచం మీద నుండి లేవలేదు.

నాసపర్యలు ఆయన స్వీకరించరు కదా! ఈ సంవత్సరం రోజుల్లో ఒకే ఒక్కరోజు జ్వరంతో కాస్త కునుకు పట్టి ఆయన వచ్చేసరికి వాకిట్లో లేనని అతను! నిర్లక్ష్యం చేయ బడ్డట్టు ఎంతగా బాధపడ్డాడనీ! మరి ఈ నిరాకరణకు ఏం పేరు పెట్టాలి? తనెంత బాధపడాలి!

పడక మీదకు వాలి గట్టిగా కళ్లు మూసుకున్నాను. నిద్ర ఒక్కటే తనకు స్వాంతన నిచ్చేది ఆ నిద్రకు కూడా జాలి లేదు. నా రెప్పలమీద వాలనంటోంది. నిద్రపోవాలని ప్రయత్నించే కొద్దీ ఆలోచన్లు నన్ను చుట్టేస్తున్నాయి. వెడ్డింగ్ డే ఆయిన మరుసటిరోజు నుండి వచ్చిన జ్వరం ఈ నాటికి తగ్గనేలేదు. మొదట అలసట వల్ల అనుకుంది అంతకు ముందు కూడా అప్పుడప్పుడూ ఇలానే ఉంటే వేడి అనుకునేది ఆరేడు నెలలుగా అప్పుడప్పుడూ వచ్చే విరోచనాలు రోజూ వుంటున్నాయి. ఇది వరకులా మెడికల్ షాప్‌లో తెచ్చుకున్న టేబ్లెట్స్‌తో తగ్గడం లేదు. ఎంత తిన్నా నీరసం, బరువు తగ్గిపోవడంతో అనుమానం వచ్చి డాక్టర్‌ని కలవక తప్పింది కాదు.

'మెడ క్రింది గ్రంథులెప్పటి నుండి వాచాయని' డాక్టర్ శేఖర్ అడిగితే తను గమనిం చింది గనకనా చెప్పడానికి! ప్రేమ మైకంలో మునిగిన తను ఆ రోజేగా కళ్లు తెరిచింది.

ఆయన చాలా ప్రశ్నలే అడిగారు. తను ఆశ్చర్యపోయేలా ఆ తలనొప్పి, దగ్గులాంటి చిన్న విషయాల్ని కూడా తరచి అడిగారు. డిస్పోజబుల్, సిరంజెస్‌తో కూకుండా, ఇంజెక్షన్ ఈ మధ్యకాలంలో వేయించుకున్నావా? అన్నారు. రక్తం ఎక్కించుకున్నావా? అని అడిగారు. అలాటివేం లెదని చెప్పాను. మీ వారికి మరే ఆడవాళ్లతోనైనా స్నేహం ఉందా? అని అడిగారు. డాక్టర్ మీద చాలా కోపం వచ్చింది ఎందుకంటే తనకు ఆయన మీద చాలా నమ్మకం.

'గుడ్డి నమ్మకం కాకపోతే మరోలా ఎలా వస్తుంది తనకీ ఎయిడ్స్ రోగం?'

డాక్టర్ శేఖర్ చాలా పరీక్షలకు వ్రాశారు. రిపోర్టు తెచ్చి ఆయన చేతిలో పెట్టింది తను. అప్పుడే సీటులో నుండి లేచి వెళ్తున్న తన ముందు పేషెంటు వైపు చూస్తూ డాక్టర్ శేఖర్ తన అసిస్టెంటుతో అన్నారు.

హెచ్.ఐ.వి. టెస్ట్ పాజిటివ్ వచ్చినపుడు పేషంట్సుకు ఎలా చెప్పాలో అర్థంకావడం లేదు గోపాల్! ఉన్న విషయం చెప్తే బాధ పడుతున్నారు. ఆ టెస్ట్ వ్రాస్తేనే అవమానించ బడ్డట్లు ఫీల్ అవుతున్నారు. అసలీ డబ్లు.హెచ్.ఒ. హెచ్.ఐ.వి మాస్ స్క్రీనింగ్‌ని తప్పనిసరి

చేయాలి.

'అందరికీ 'హెచ్.ఐ.వి. టెస్ట్ చేసి ఎవరికైన ఎయిడ్స్ అని తేల్చినందువల్ల ప్రయోజనమేమిటి సర్. పేషంట్స్ మానసికంగా అప్‌సెట్ అవడం తప్ప. దానికి ట్రీట్‌మెంట్ వేక్సినేషన్ రెండూ లేకపోయే! 'డాక్టర్ గోపాల్ అనుమానాన్ని డాక్టర్ శేఖర్ కొట్టిపారేయలేదు.'

'నిజమేకాని అందరికీ ఎయిడ్స్ అని తేల్చే టెస్ట్ తప్పనిసరి అన్నపుడు కొంత విచ్చలవిడితనం తగ్గుతుంది. పైగా కాండమ్స్ లాంటి ప్రివెంటివ్ మెజర్స్ తీసుకుంటే ఇంతలా వ్యాపించడం తగ్గుతుంది కదా!' అంటూ తన రిపోర్ట్‌లోకి చూసి కొద్దిగా చలించారాయన.

మీ వారిని పంపమ్మా! ఇంకొన్ని టెస్ట్స్ చేయాలి. ఆయనకు వివరాలు చెప్తాను? అని ఆయన నాకు ఎయిడ్స్ జబ్బున్న విషయాన్ని తన దగ్గర దాచారు. తనచుకుంటే నవ్వొస్తుంది. నా జబ్బు సంగతి పరాయి వ్యక్తి దాచారుగానీ, తన ప్రియమైన భర్త తనకు జబ్బుందని నిస్సంకోచంగా చెప్పేశారు. తమాషా ఏమిటంటే ఆయనకూ పాజిటివ్ అని చెప్తే చీకటి తప్పుచేసిన ఆయన నమ్మలేదు. తప్పుచెయని తనని మాత్రం వెలివేశారు.

రాయవేలూరులో సి.యమ్.సి. హాస్పిటల్‌లో హెచ్.ఐ.వి. టెస్ట్ చెసి ఈయనకూ పాజిటివ్ అని తేల్చి చెప్పినప్పుడు ఈయన ఆ డాక్టర్‌ని నిలదీశారు.

'మరినాకు ఎలాటి బాధలు ఎందుకని లేవు?' అని

'కొందరికి జబ్బువున్నా ఎలాటి బాధలూ ఉండవు వాళ్లను డార్మెంట్స్ అంటారని ఓపిగ్గా ఎన్నో ఉదాహరణలు చెప్పి ఈయనను నమ్మించాలని ఆ డాక్టర్ చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. నిశ్శబ్ధంగా ఆ డాక్టర్ ఛాంబర్ వదిలేసి ఆయన ఆమౌనాన్ని ఇంకా కొనసాగిస్తూనే ఉన్నారు. మొదట్లో భార్యకొచ్చిన జబ్బుకు బాధపడుతున్నారనుకుంది. రూమ్స్ సెపరేట్ చేసినప్పుడు తనకా జబ్బు అంటుకుంటుందని భయపడుతున్నారని సర్ది చెప్పుకుంది. విడాకులు కాగితం తెచ్చి సంతకం చేయమన్నపుడుగానీ ఆయన నిజస్వరూపం తనకర్థం కాలేదు.

'నీ జీవితం పాడవుతుందని డాక్టర్స్ నాకూ జబ్బుందని అబద్ధాలు చెప్తున్నారు. నీ వల్లనా జీవితం అన్యాయమైపోయేలా వుంది' అని ఆయన అన్న మాటలు విన్న తనకు మొదటి సారిగా చాలా బాధనిపించింది. 'ఎయిడ్స్ టెస్ట్ పాజిటివ్ వున్నా రోగి శరీరంలో రక్తం సమృద్ధిగా వుండి అందులో ప్రోటీన్స్ పుష్కలంగా వుండీ, మనిషి ఉండాల్సినంత బరువువుంటే ఆ శరీరానికి వ్యాధి నిరోధక శక్తి ఉంటుందనీ ఆ వైరస్ వల్ల రోగలక్షణాలు కనపడవనీ ఆ రోజు డాక్టర్ చెప్పింది గుర్తొచ్చి' ఇన్నాళ్లూ భర్త ఇష్టప్రకారం నాజూగ్గా ఉండాలని డైటింగ్ చేసినందుకు తన మనస్సు పశ్చాత్తాపడింది.

ఒక వేళ తనకా జబ్బుండి ఆయనకు లేదనుకున్నా.... దాంపత్యం కొనసాగించాలని ఆశగానీ దుర్బుద్ధిగానీ తనకు లేదు కేవలం వంట చేసి పెడ్తూ 'ఆయన తోడువున్నాడనే, ధైర్యంతో బ్రతికితే చాలు. అలా అని ప్రాధేయపడినా అతను కరగలేదు 'మరో పెళ్లిచేసుకోండి నన్ను మాత్రం తరిమికొట్టి ఈ సమాజంలోకి విసిరివేయకండి' అని కాళ్లు పట్టుకున్నా అతను కరగలేదు. 'నిన్ను చూడందే క్షణం కూడా వుండలేనని' నితనని అలరించి, ఊరించి తల్లిదండ్రుల్ని సైతం ధిక్కరించే మైకంలోకి నెట్టేసి, తన పాపాన్ని తన కంటించి

తనుమాత్రం తప్పుకుంటున్నాడిప్పుడు, 'దోషం చేసింది అతను శిక్ష మాత్రం తనకి

'అప్పుడెప్పుడో టి.వి. లో ఎయిడ్స్ గురించి చెప్తుంటే తన స్నేహితురాలు రజని అంది'.

'పోలియో గురించి జనంలో అవేర్‌నెస్ వచ్చింది గదా గవర్నమెంట్ పల్స్ పోలియోకి పెట్టే ఖర్చుని ఎయిడ్స్ స్క్రీనింగ్‌కి పెడ్తే బావుంటుంది. అసలు నన్ను అడిగితే పెళ్లికి ముందే హెచ్.ఐ.వి. టెస్ట్, సెమెన్ టెస్ట్, ఓవమ్ టెస్ట్‌చేయాలి' అని అదివిని నీ పిచ్చిగానీ జరిగే పనులు చెప్పు, అలా అయితే ఎవరికి పెళ్లిళ్లకావు' అని కొట్టి పారేయ లేదూ తను!' 'ఇలా పెళ్లిచేసుకుని విసిరివేయబడేకంటే కన్యగా మిగిలిపోవడం మేలుకదూ!' మరలా తలుపులో తాళం పెడ్తున్న చప్పుడు ఆయనలా తలుపు శబ్దం చేసినప్పుడల్లా నా జబ్బు బాధకంటే అవమానం తాలూకు వ్యథే నన్నెక్కువ బాధిస్తోంది. రోజులా ఈసారి ఆయన నేరుగా తన రూమ్‌లోకెళ్లలేదు నా దగ్గరకొచ్చి గడపలో ఆగిపోయి గోడవైపు చూస్తూ అన్నాడు,

"చూడూ విడాకులివ్వకపోతే ఇవ్వకపోయావు. కనీసం మీ పుట్టింటికన్నా వెళ్లిపో..."ఎంత స్వార్థం.!

తన తల్లి కాళ్లా వేళ్లా పడ్డప్పుడు 'నువ్వు పుట్టింటికెళ్తే ఒంటరిగా నేనుండ లేనన్న' పెద్ద మనిషి. ఈ రోజు నన్ను శాశ్వతంగా పుట్టింటికెళ్లమంటున్నాడు....

'కాదని వచ్చిన వాళ్ల దగ్గరకు ఏం మొహం పెట్టుకుని వెళ్లాలి? అందరూ ఈ జబ్బుని తెలిసాక వాళ్లు మాత్రం ఉండనిస్తారా?' నేను లేచి నిలబడ్డాను. నాకు తెలిసిపోయింది ఈ ఇల్లు నాదికాదని.

"నేను.... నేనెప్పుడైనా వస్తుండచ్చా?" ఈ ఇంటి తలుపులు ఇక నా కొరకు తెరచి ఉండబడవని తెలిసి కూడా ఆఖరీ ఆశతో అడిగాను.

ఈ ఆడపిల్లల మనస్సులోని ప్రేమ ఎంత చిక్కటిదీ! ఈ పురుషాధిక్య సమాజంలో వాళ్ల జీవితాలకెంత అభద్రత!!' ఈ ఆడపిల్లల జీవితాలు ఎంత హైన్యమయినవి వద్దు! అంటున్నా నువ్వే కావాలని ఆడవాళ్ల మనసుల్ని తన ప్రక్కకు తిప్పుకునేదాకా వాళ్ల వెంట తిరిగి తీరా పెళ్లయ్యాక వాళ్లనే తమ వెంట పడేంతగా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ మగవాళ్లు. ఇదెక్కడిన్యాయం? ఇదే జబ్బు ఆయనకొచ్చుంటె తనాయన్ని ఇంతనిర్దయగా వదిలేసుం డేదా?' ఈ అలాగే మా ఆయన నోరు విప్పారు నీఇష్టం ఎలా అయినా నన్ను ఒది లించుకోవాలనే ఆయన తాపత్రయం నాకర్థమయింది. నిద్రలేని ఆ రాత్రి గడిపిన నేను ఓ నిర్ణయానికొచ్చాను. సూట్‌కేస్‌లో బట్టలు సర్దుకున్నాను. ఏదున్నా ఏది లేకపోయినా ఈ పాడు జబ్బును కప్పుకోవడానికి పది మూరల చీర కావాలికదా?

---

నా పుట్టింటికెళ్లి నారాక తాలూకు ఆనందాన్ని మా అమ్మ తీరా అనుభవించకముందే ఎలాటి ఆలస్యం చేయకుండా అమ్మతో నా జబ్బు సంగతి ఆ అమానుష తిరస్కృతి సంగతి చెప్పేశాను.

ఆదరిస్తే బ్రతకడం లేకపోతే గుప్పెడు మాత్రలు మింగి పిడికెడు గుండె నాడిని ఆపేసుకోవడం

అలా అని నిర్ణయించుకుని ఆమె తీర్పుకోరకు ఎదురుచూస్తున్న నేను అమ్మ ఏడుపు శబ్దానికి ఉలిక్కిపడి తలెత్తాను. నన్ను పొదివి పట్టుకుని ఒళ్లోకి లాక్కుందమ్మా. పెల్లగించుకుని వస్తున్న ఏడుపును దిగమింగకోవడానికి ప్రయత్నిస్తూనా ఒళ్లంతా నిమురుతూ ముద్దుపెట్టుకుంది.

"వద్దు వద్దమ్మా నీకంటుకుంటుందేమో!" డాక్టర్స్ అంతా ఏక కంఠంలో ముట్టుకున్నంత మాత్రాన అంటుకోదు అని చెప్పినా వెలివేయబడ్డ నా మనసు నిండా ఆమైకం అల్లుకునే ఉంది.

నేను దూరంగా జరగడానికి ప్రయత్నించాను. అమ్మ నన్ను కదలనీలేదు. వెక్కిళ్లు పెడ్తూ ఇంకా హత్తుకుంది. తనకు గర్భసంచికేన్సర్ అని తెలిసినప్పుడు కూడా ఆమె ఇంతలా బాధపడలేదు. 'ఇలాంటి మాతృమూర్తికి ద్రోహం చేసినందుకే మోతను మాతృత్వపు మాధుర్యాన్ని చవిచూడకుండానే మృత్యువుకి ఎదురెళ్తోంది.' మా అమ్మ ఏడుపు ధ్వనికి అమ్మ గదిలో కొచ్చిన నాన్నను చూసి భయడ్డాను 'కాదంటారేమోనని' కానీ నా దురదృష్టాన్ని అమ్మ నోట విన్న నాన్న అమ్మలా ఏడవలేదు కానీ అక్కడే కుర్చీలో కూలబడిపోయారు.

ఆ మర్నాడు ఇంట్లో సభ్యులందరికీ విషయం చెప్పింది అమ్మ. వాళ్లు తమ నోటితో కాదనలేదు కానీ నిశ్శబ్దంగా తమ నిరసనను తెలియజేశారు. నేను పెళ్లయి ఆ ఇంటి గడపదాటుతున్నపుడు మరోసారి ఆలోచించు నీ మెడలో పడింది. ఆ తాళేకదా! దాన్ని తీసిపారేయ్ అని మనస్ఫూర్తిగా నా మేలుకోరిన అన్నలు ఈ రోజు తనను వుంచుకోవడానికి ఇష్టపడలేదు. వదినలు చెప్పారో ఏమో! అందరికీ తెలిసిపోయిందా వార్త. కొందరి జాలి చూపులు, కొందరి వెనకడుగులు, మరికొందరి సలహాలు మొత్తానికి ఇంత మంది నిరసనతో ఆ ఇంట్లో వుండడం దుర్భరంగా అన్పించి అమ్మతో అన్నాను. 'అమ్మా!' నేను మధర్ థెరిస్సా హోమ్ కెళ్తాను. అక్కడ నాకింత చోటు దొరక్కపోతుందా?' అమ్మ అదిరిపడి చలించిపోయింది.

"ఏమిటి తల్లీ! నువ్వు మాట్లాడేది ఈ అమ్మను వదిలి ఆ అమ్మ దగ్గరకెళ్తావా? నా బొందిలో ప్రాణం వుండగా నిన్ను అనాథను చేస్తానా?" అని తన చల్లటి ఒళ్లోకి లాక్కుని ఏడ్చేసిందమ్మ. అల్లంత దూరానున్న నాన్న కళ్లల్లో తడి ఎంత పాపిష్టిదితను! ఏనాడైనా నాన్న కన్నీళ్లు చూసిందా తను!

"కమలా! ఆ పిల్లనేడ్పించొద్దు. వేరే ఇల్లు చూసొచ్చాను. సామాను సర్దుకోండి. మన ముగ్గరం అక్కడుందాం".

నేను కదలిపోయాను. వాళ్లనుకాదని వెళ్లినా క్షమించి అక్కున చేర్చుకున్నారు అమ్మా-నాన్న, ఇదీ... నిజమైన ప్రేమంటే, కథల్లో, సినిమాల్లో అతి ప్రాధాన్యతనిస్తూ నాలాటి వాళ్లను తప్పుత్రోవ పట్టిస్తున్న ప్రేమ ప్రేమకాదు. హార్మోన్స్ వల్ల వచ్చే ఆకర్షణ. వయసు వల్ల వచ్చే వ్యామోహం అది తెలుసుకుంటే ఎవ్వరి జీవితాలూ నా జీవితంలా మరో మోసపోయిన ఆడపిల్ల జీవితంలా నష్టపోవు. నష్టపోకూడదు.